వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేద్దాం


కనగానపల్లిలో సమావేశమైన వైఎస్సార్‌సీపీ మండల నాయకులు

కనగానపల్లి: గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ కలసికట్టుగా పనిచేద్దామని ఆ పార్టీ మండల కన్వీనర్ నాగముని పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం వైఎస్సార్‌సీపీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీ, గ్రామ కమిటీల నియామకంపై పార్టీ కన్వీనర్‌తో పాటు జిల్లా యూత్ విభాగం అధ్యక్షుడు గంగుల సు. దీర్‌రెడ్డి, మండల నాయకులు చర్చించారు. రాప్తాడు నియోజక వర్గ పార్టీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని నాయకులు తెలిపారు. మండల స్థాయి కమిటీతో పాటు వివిధ విభాగాల చెందిన అధ్యక్షులు ఎన్నిక చేస్తున్నామన్నారు. ఇందుకు ఆసక్తిగా ఉన్న వారి పేర్లను నమోదు చేసుకున్నారు. మండల కమిటీ నియామకం తర్వాతా గ్రామాల వారీగా పార్టీ కమిటీలను నియమిస్తామని కన్వీనర్ తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మామిళ్లపల్లి అమరనాథరెడ్డి, బద్దలాపురం పెద్దిరెడ్డి, కనగానపల్లి అశోక్, రవి, గోపాల్, భాస్కర్, కోనాపురం రామాంజి, వేపకుంట రామలింగారెడ్డి, పోతన్న, నారాయణ, క్రిష్టారెడ్డి, రాజు, నరసంపల్లి ముత్యాలు, రాజన్న, భానుకోట మాధవరాజులు, చంద్రశేఖర్, మద్దెలచెరువు వెంకటేష్, నారాయణరెడ్డి, నరేష్, కిష్టా, ముక్తాపురం రామక్రిష్ణ, వెంకటనారాయణరెడ్డి, ఓబిలేసు, నాగిరెడ్డి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేరుశనగ పంట పరిశీలన

పుట్టపర్తి టౌన్: బుక్కపట్నం మండలం కృష్ణాపురంలో ఏరువాక కో ఆర్డినేటర్ రామసుబ్బయ్య, సీనియర్ విత్తన ధ్రువీకరణ అధికారి నాగ శివయ్య బుధవారం వేరుశనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వేరుశనగ కాయ అభివృద్ధి దశ నుంచి కోత దశ వరకు ఉందన్నారు. గత అక్టోబర్‌లో సాగు చేసిన వేరుశనగ పంట కోత పూర్తయ్యిందని, ఎకరాకు ఆరు నుంచి ఏడు బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చిందన్నారు. పంటకు మచ్చతెగుళ్ల ఆశించడం వల్ల దిగుబడి తగ్గిందన్నారు. నవంబర్, డిసెంబర్ మాసాల్లో సాగుచేసిన వేరుశనగ ఆశాజనకంగా ఉందన్నారు. కార్యక్రమంలో విత్తన ధ్రువీకరణ అధికారులు కిరణ్మయి, తేజస్విని, భిక్షపతితో పాటు కృష్ణాపురం రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ


సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఆర్డీ ప్రమీళ, స్పెయిన్ దేశస్తులు

కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థులకు బుధవారం ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో సైకిళ్లు పంపిణీ చేశారు. స్థానిక ఆర్డీటీ ఏరియా కార్యాలయంలో సంస్థ ప్రతినిధులు, దాతలు స్పెయిన్ దేశస్తులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 61 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీటీ రీజనల్ కో-ఆర్డినేటర్ ప్రమీళ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకునే పేద విద్యార్థులకు చేయూత అందించాలనే ఉద్దేశంతో స్పెయిన్ దేశస్తుల సహకారంతో ఆర్డీటీ సైకిళ్లు పంపిణీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏటీఎల్ పార్వతి, స్పెయిన్ దేశస్తులు జాకబ్, స్టెఫనో, యరా, పాఠశాల ఉపాధ్యాయులు శివారెడ్డి, జయచంద్ర, పీడీ శివారెడ్డి, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడదాం

రామగిరి: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాడదామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీనుగ నాగరాజు పేర్కొన్నారు. బుధవారం పోలేపల్లి పంచాయతీలోని పాపిరెడ్డిపల్లి, చెర్లోపల్లి, అక్కంపల్లి, పోలేపల్లి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామ కమిటీలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆదిరెడ్డి, పెద్దిరెడ్డి, విశ్వనాథరెడ్డి, రామాంజనేయులు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారాను నిర్మూలిద్దాం

చెన్నేకొత్తపల్లి: నాటు సారాను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి (డీపీఈఓ) గోవింద నాయక్ సూచించారు. చెన్నేకొత్తపల్లి ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగినేపల్లి దిగువ తండా, మేడాపురం గ్రామాల్లో బుధవారం నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి మాట్లాడుతూ.. నాటు సారాను తయారు చేయడం, విక్రయించడం నేరమన్నారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి తయారు చేసినా విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కళా బృందాలతో పాటల రూపంలో ప్రజలకు చైతన్యం కల్పించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ఫరూక్ ఆజాం, ఎస్‌ఐ శివప్రసాద్ పాల్గొన్నారు.

25న చలో కలెక్టరేట్

పుట్టపర్తి టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25న చలో కలెక్టరేట్ నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్ అధ్యక్షతన పార్టీ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న రాంభూపాల్ మాట్లాడుతూ... జిల్లాలో అర్ధంతరంగా ఆగిపోయిన జగనన్న ఇళ్లు, టిట్కో ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు పట్టణాల్లో రెండు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల చొప్పున స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలోనూ శ్మశానానికి భూమిని కేటాయించాలని, ఉపాధి బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. రైతులకు నష్టం కలిగించే హంద్రీనీవా లైనింగ్ పనులు వెంటనే నిలిపివేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులు, నరసింహులు, జంగాలపల్లి పెద్దన్న, దిల్షాద్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

22న సర్వసభ్య సమావేశం

గాండ్లపెంట: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 22న ఎంపీపీ గంగోజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి తెలిపారు.

23న వైద్య శిబిరం

ధర్మవరం రూరల్: ఈ నెల 23న ధర్మపురి గ్రామంలో విన్సెంట్ ఫెర్రర్ మెమోరియల్ ఆధ్వర్యంలో వృద్ధులు, దివ్యాంగుల కోసం త్రైమాసిక గ్రామీణ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ సత్య నిర్థారన్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని మండల పరిషత్ యూపీ స్కూల్‌లో వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు నాగేంద్ర, మెహర్‌బాబా సెంటర్ అధ్యక్షురాలు సుజాత, కృష్ణమూర్తి, బీరే శ్రీరాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

ధర్మవరం రూరల్: మాలగుండ్లపల్లికి చెందిన నాగరాజు, నడిమిగడ్డపల్లి తండాకు చెందిన గోపాల్ నాయక్‌లు బుధవారం ద్విచక్ర వాహనంపై ధర్మవరం వస్తుండగా దర్శనమల సమీపంలో ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన నాగరాజు, గోపాల్‌నాయక్‌ను ఆస్పత్రికి తరలించారు.

నీటి సమస్య తీర్చండి

ఓడీచెరువు : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను తీర్చాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రజలతో కలిసి వారు ఎండీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి చలపతి, నాయకులు రత్నబాయి, దేవేంద్ర, మరువ కాలనీ వాసులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనపై అవగాహన

కదిరి టౌన్: పట్టణంలోని బస్టాండు ప్రాంతంలో జాతీయ క్షయ వ్యాధి నిర్మూలనపై టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాసులు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

డ్రైయినేజీ పనులు ప్రారంభం

కదిరి అర్బన్: మండల పరిధిలోని సోమేష్‌నగర్‌లో రూ.8లక్షల నిధులతో చేపట్టిన డ్రైయినేజీ నిర్మాణ పనులను ఎంపీడీఓ పోలప్ప బుధవారం ప్రారంభించారు.

రెండు కార్లు ఢీ

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం జగరాజుపల్లి వద్దనున్న మంగళకర కళాశాల సమీపంలో బుధవారం గోరంట్ల నుంచి వస్తున్న కారు, కొత్తచెరువు నుంచి వస్తున్న కారు ఢీకొన్నాయి. కార్లు స్వల్పంగా దెబ్బతినగా.. డ్రైవర్లు సురక్షితంగా బయటపడ్డారు.

రాచువారిపల్లి కాలనీలో చోరీ

తనకల్లు: రాచువారిపల్లి కాలనీలో నివాసముంటున్న దేశాయి భక్తవత్సలరెడ్డి ఇంట్లో 5 గ్రాముల బంగారు, అరకిలో వెండి వస్తువులు చోరీ అయ్యాయి. బాధితుడు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.



ఖాద్రీ క్షేత్రం.. భక్తజన కెరటం


ఆలయంలో పోటెత్తిన భక్తులు


ఐరావతంపై నారసింహుడి దర్శనం


తిరువీధుల్లో విహరిస్తున్న శ్రీవారు

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి రథోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరగనుంది. శ్రీవారిని బ్రహ్మ రథంపై దర్శించుకునేందుకు ఒక రోజు ముందే అంటే బుధవారమే సుదూర ప్రాంతాల నుంచి భక్తులు కదిరికి చేరుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణంతో పాటు పురవీధులన్నీ భక్తులతో పోటెత్తాయి. ఆలయంలో నారసింహుని దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. పట్టణంలో దాతలు అడుగడుగునా అన్నదాన కేంద్రాలు ఏర్పాటు చేశారు. భక్తుల కాలక్షేపం కోసం ఆలయంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఇంకా పట్టణంలో పలుచోట్ల నాటక ప్రదర్శనలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామి వారు తిరువీధుల్లో ఐరావతంపై దర్శనమిచ్చారు.

భక్తులు పాటించాల్సిన నియమాలు..


నరసింహాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకుడు, కదిరి

ఆలయాలకు వెళ్లే భక్తులు విధిగా కొన్ని నియమాలు పాటించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన వివరాలను కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు నరసింహాచార్యులు తెలియజేశారు.

- ఆలయ ప్రాంగణంలోకి పాదరక్షలతో ప్రవేశించకూడదు.
- గుడికి వెళ్లేటప్పుడు సంప్రదాయ దుస్తులనే ధరించాలి.
- గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసిన తర్వాత గుడిలోకి వెళ్లి స్వామివారిని దర్శించుకోవాలి.
- ప్రదక్షిణలు చేసేటప్పుడు స్వామివారి వెనుక భాగాన గోడకు తల ఆనించడం.. చేతులతో తాకడం మంచిది కాదు. అక్కడ రాక్షసులు ఉంటారు. వారిని మీరు నిద్ర లేపి మీ వెంట తీసుకెళ్లిన వారవుతారు. గుడి చుట్టూ ఏర్పాటు చేసిన బలి పీఠాలను కూడా తాకకూడదు.
- గుడిలో స్వామివారిని దర్శించుకునేటప్పుడు దేవుడికి ఎదురుగా నిల్చోకూడదు. ఎడమ లేదా కుడి వైపున నిల్చొని దర్శించుకోవాలి. ఎందుకంటే ఆలయంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించేటప్పుడు ఎన్నో శక్తులను ఆపాదించి విగ్రహప్రతిష్ఠ చేస్తారు. ఆ శక్తి తరంగాలు నేరుగా మన దేహంపై ప్రభావం చూపుతాయి.
- గుడిలో మొదట ధ్వజస్తంభాన్ని దర్శించి అనంతరం గుడిలోకి వెళ్లాలి.
- ఏ ఆలయానికి వెళ్లినా సరే..కొందరు అక్కడి విగ్రహాలను తాకాలని ప్రయత్నిస్తుంటారు. అలా చేయడం మంచిది కాదు. అది చెడు ప్రభావాన్ని చూపుతుంది.
- గుడిలోకి ప్రవేశించగానే గంట మోగిస్తే 'స్వామీ..నేను వచ్చాను' అని చెప్పడం. అంతేకాదు 'స్వామీ..నేను రావచ్చా..' అని అనుమతి తీసుకోవడం కూడా అవుతుంది.


పూల అలంకరణలో ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం


రథ కలశం మోసుకెళ్తున్న ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి


వాణివీధిలో భక్తులకు అన్నదానం